క్లుప్తంగా

డ్రెయినేజీ శుభ్రం



డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండలంలోని దాసుతండా పంచాయతీ లచ్చతండా అంగన్‌వాడీ కేంద్రం పక్కన డ్రెయినేజీలో మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక సమస్య నెలకొనగా 'సాక్షి'లో సోమవారం 'అటెన్షన్ ప్లీజ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీఓ గణేశ్ ఆదేశాల మేరకు కార్యదర్శి శరత్‌చంద్ర సిబ్బందితో మురుగు శుభ్రం చేయించారు.

కఠిన చర్యలు తప్పవు..



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహమాన్

సుజాతనగర్: విద్యాసంస్థల్లో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదని కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కే అబ్దుల్ రహమాన్ హెచ్చరించారు. సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పరీక్షల సమయం అయినందున విద్యాసంస్థలకు సమీపంలో డీజే చప్పుళ్లు, క్రాకర్స్ కాల్చడం వంటి పనులు చేయొద్దని తెలిపారు. విద్యార్థులకు ఏమాత్రం అసౌకర్యం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సీఐ రమాకాంత్, ఎస్‌ఐ పి.తిరుపతి రావు, ఏఎస్‌ఐ సత్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే సహించేది లేదు..

ఇల్లెందురూరల్: ప్రభుత్వ ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే సహించబోమని తహసీల్దార్ కృష్ణవేని స్పష్టం చేశారు. మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీకి చెందిన కొందరు మహిళలు పంచాయతీ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఖాళీస్థలంలో సోమవారం గుడిసెలు వేస్తున్నట్లు తెలుసుకొని పోలీసులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. గుడిసెలు వేయొద్దని పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పష్టం చేయడంతో ఆగ్రహించిన మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామపంచాయతీకి సంబంధించిన ఖాళీస్థలం అయినందునే ఇంటి స్థలం లేని నిరుపేదలమైన తాము గూడు ఏర్పాటు చేసుకునేందుకు ఈస్థలాన్ని ఎంచుకున్నామని చెప్పారు. స్థలం అవసరమైన వారు అధికారులకు అర్జీ పెట్టుకోవాలని, అవకాశాన్ని బట్టి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిస్థలాలు కేటాయిస్తారని తహసీల్దార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పద్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రకు పలువురి సంఘీభావం

మంచుపల్లి: పీపుల్స్ మార్చ్ పేరుతో బోథ్ నియోజకవర్గం పిప్రీ గ్రామం నుంచి కాంగ్రెస్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపడుతున్న పాదయాత్రకు సోమవారం పలువురు సంఘీభావం తెలిపారు. కొత్తగూడెం బిందు పల్లవి వైద్యశాల డైరెక్టర్ బానోత్ కిషన్‌నాయక్, విజయలక్ష్మి దంపతులు స్వయంగా భట్టిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత భట్టిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

శివాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సుజాతనగర్: దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో మొత్తం 8 సీసీ కెమెరాలను అమర్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ హరిశ్చంద్రశేఖర్, కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, సభ్యులు గడ్డం వీరరాజశేఖర్, భూక్యా శోభన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ సోమవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. శుభకార్యాలకు హాజరయ్యారు. బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, మాళోతు సురేందర్, ఉండేటి బసవయ్య, రామ, లింబ్య, శివకృష్ణ, జాటోతు నరేశ్, ఇస్లావత్ బాలు, కిషన్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అకౌంటెంట్ పోస్టు భర్తీ

పాల్వంచరూరల్: పాల్వంచ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచ్ అకౌంటెంట్‌గా దంతలబోరులో సీనియర్ సేల్స్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లను నియమించినట్లు బ్రాంచ్ మేనేజర్ లక్ష్మమోజీ సోమవారం తెలిపారు.

మిర్చినైనా కొనుగోలు చేస్తారా?

- పడావు పడుతున్న ఇల్లెందు మార్కెట్
- కొనుగోళ్లు లేవు.. పాలకవర్గం ఊసే లేదు
- మిర్చి సీజన్‌లో ఇబ్బంది పడుతున్న రైతులు
- ఇదే అదునుగా దోచుకుంటున్న ప్రైవేట్ వ్యాపారులు



మార్కెట్ కార్యాలయ పాత భవనం



కొనుగోళ్లు లేక నిర్మానుష్యంగా మారిన యార్డు

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పడావు పడుతోంది. ఇక్కడ ఏ పంట కూడా కొనుగోళ్లు జరగడం లేదు. పాలక వర్గం పదవీ కాలం గత ఏడాదితో ముగిసినా నూతన పాలకవర్గాన్ని నియమించకపోవడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. మార్కెట్‌లోనే కాదు ఈ మార్కెట్ పరిధి సబ్ మార్కెట్లలోనూ అదే పరిస్థితి నెలకొంది. చెక్ పోస్టుల ద్వారా లక్ష్యాన్ని మించి ఆదాయం నమోదు కావడంతో దీనిని ఘనతగా చెప్పుకుంటూ మార్కెట్‌లో కొనుగోళ్ల మాట మరిచారు.

మిర్చి సీజన్..

ప్రభుత్వ సంస్థల ద్వారానే వరి, మొక్కజొన్నలు కొనుగోలు చేస్తారు. ఇక మొక్కజొన్న, పత్తి పంటల విక్రయాలు పూర్తయ్యాయి. ఇప్పుడు మిర్చి కొనుగోళ్లు చేపట్టాలి. గ్రామాల్లో మిర్చి ఏరివేత తుది దశకు చేరగా.. అమ్మకానికి రైతులు ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. ఇల్లెందు మార్కెట్‌లో మాత్రం కొనుగోళ్లు జరగక.. ప్రైవేట్ వ్యాపారులు, దళారులు పోటీ పడి కొంటర్లు తెరిచి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో మేల్కొన్న అధికారులు ఇటీవల వ్యాపారులతో సమావేశం ఏర్పాటుచేయగా అమావాస్య తర్వాత మిర్చి కొనుగోళ్లు చేస్తామని అంగీకరించారు. అయితే, అప్పటికే చాలా మంది రైతులు ఖమ్మం మార్కెట్‌తో పాటు స్థానికంగా ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేసుకుంటారా? వేచి ఉంటారా? అన్నది తేలాల్సి ఉంది.

జిల్లాలో పెద్దది..

ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ జిల్లాలోనే అతి పెద్దది. ఈ మార్కెట్ పరిధిలో ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, బయ్యారం, గార్ల, కామేపల్లి, కారేపల్లి మండలాలు ఉండగా.. గుండాల, టేకులపల్లి, బయ్యారం, గార్లలో సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఇక్కడ 53 మంది అనుమతి కలిగిన వ్యాపారులు ఉన్నా కొనుగోళ్లు చేయకపోవడం గమనార్హం. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్‌కు వివిధ ఫీజుల రూపంలో రూ.3.15 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ, మార్కెట్‌లో కొనుగోళ్లు జరగకున్నా.. చెక్ పోస్టుల ద్వారా లక్ష్యానికంటే ఎక్కువగా.. రూ.3.54 కోట్ల ఆదాయం నమోదైంది. దీంతో ఇదే ఘనతగా చెప్పుకుంటూ మార్కెట్‌లో కొనుగోళ్లపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. ఇకనైనా రైతులకు మేలు జరిగేలా అధికారులు, ట్రేడర్లు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

కనీసం మిర్చినైనా కొనాలి..



రైతులు పండించిన పంటలను వ్యాపారులు పల్లెల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. రైతుల కోసం నిర్మించిన మార్కెట్‌లో వారికి మద్దతు ధర దక్కేలా కొనుగోళ్లు చేపట్టాలి.

–పులి సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

మార్కెట్లతో మేలు జరగాలి



పంట ఉత్పత్తులను మార్కెట్లో కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ప్రైవేట్ దోపిడీని అరికట్టినట్లు అవుతుంది. కాంటాలు, ధరల్లో తేడాలు ఉండవు. అదే ప్రైవేట్ వ్యాపారులైతే తరుగు, తాలు పేరుతో దోచుకుంటారు. ఇకనైనా అధికారులు రైతులకు మేలు చేసే దిశగా చర్యలు చేపట్టాలి.

–నాయిని రాజు, ప్రజాపంథా మండల కార్యదర్శి

అమావాస్య తర్వాత కొనుగోళ్లు..



ఇప్పటికైతే ధాన్యం, మొక్కజొన్న సీజన్ ముగిసింది. ఇక మిర్చి పంట చేతికి వస్తోంది. వారం కిందట ట్రేడర్లతో సమావేశం నిర్వహించగా అమావాస్య తర్వాత మిర్చి కొనుగోలు చేస్తామని ప్రకటించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు మార్కెట్‌లో మిర్చి విక్రయించి మద్దతు ధర పొందాలి.

–ఎంఏ అలీం, కార్యదర్శి, ఇల్లెందు మార్కెట్

పలు గ్రామాల్లో బోనాలు

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని బిట్టుతండా (పంతులుతండా, టాక్యాతండా, పీక్లాతండా), గొల్లగూడెం గ్రామాల్లో సోమవారం బోనాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసిన మరునటి రోజు సోమవారం బోనాలను సమర్పించారు.

ఉగాది సందర్భంగా గ్రామోత్సవం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి (గణేశ్ టెంపుల్) ఆలయంలో ఉగాది సందర్భంగా బుధవారం నిర్వహించనున్న గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని ఈఓ కె.సులోచన కోరారు. శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి, శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీకోదండ రామస్వామి, సిద్ధి బుద్ధి సమేత వల్లభ గణపతి వార్ల షడ్వాహన మూర్తి ఉత్సవం (గ్రామోత్సవం) రాత్రి 7 గంటలకు ప్రారంభం అవుతుందని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

ఇళ్లు కట్టించి ఇవ్వాలి

టేకులపల్లి: నిరుపేదలకు కూడు, గుడ్డ, గూడు కల్పించాల్సిన పాలకులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని భారతీయ సర్వ సమాజ్ మహాసంఘ్ (బీఎస్‌ఎస్‌ఎం) జిల్లా అధ్యక్షురాలు ఈసం నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యాన సోమవారం ఆదివాసీ, గిరిజన నిరుపేదలతో తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అంజాద్ పాషాకు వినతిపత్రం అందించి మాట్లాడారు. నేటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ, గిరిజన నిరుపేదలు పూరిగుడిసెలు, రేకుల ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పాలకులు స్పందించి నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని, 2005కు ముందు నుంచి సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ సుష్మా, గుగులోత్ నాగేశ్వరరావు, గుగులోత్ రమేశ్, సూరె సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..



కొత్తగూడెంరూరల్: బాధితులతో మాట్లాడుతున్న నాగా సీతారాములు



ఇల్లెందురూరల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్డీ కార్యకర్తలు

అకాల వర్షాలకు పంటలు కుదేలైన రైతులను.. ఇళ్లు దెబ్బతిని నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా పార్టీల ఆధ్వర్యంలో దెబ్బతిన్న పంటలు, ఇళ్లను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. నష్టం జరిగి ఇబ్బంది పడుతున్నవారికి అండగా నిలవాలని నినదించారు.

కొత్తగూడెంరూరల్/సుజాతనగర్: లక్ష్మీదేవిపల్లి మండలంలో టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు పర్యటించి పైకప్పులు లేచిపోయిన ఇళ్లు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. శ్రీనివాసులు, సత్యనారాయణ, వీరబాబు, మల్లేశ్ పాల్గొన్నారు. కాగా, సుజాతనగర్ మండలంలో బీఎస్పీ నేత ఎర్రా కామేశ్ పర్యటించారు.

ఎన్డీ ఆధ్వర్యంలో ధర్నా

ఇల్లెందురూరల్/ఇల్లెందు: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కందగట్ల సురేందర్, పొడుగు నర్సింహారావు, మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు, వాంకుడోత్ సరోజిని, చింత రజిత, జోగా కాంతారావు, మోతీలాల్, శంకర్, మంగీలాల్, రాంబాబు, భిక్షం తదితరులు పాల్గొన్నారు. కాగా, కొమరారం గ్రామంలో ప్రజాపంథా నాయకులు రాస్తారోకో చేశారు. నాయిని రాజు, ఆజ్మీర బిచ్చా, బుర్ర వెంకన్న, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఎన్డీ చంద్రన్నవర్గం రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదళ్లపల్లి సత్యం, మోకాళ్ల రమేశ్ తదితరులు పర్యటించారు.

పేదల జీవితాల్లో 'వెలుగు' నింపుతోంది..



కళ్లజోడును అందిస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే రోల్ మోడల్ అని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీ 33వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కంటి వెలుగు ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగు నిండుతోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, దామోదర్‌యాదవ్, రావి మమత, భీమా శ్రీధర్, రావి రాంబాబు, యూసుఫ్, అశోక్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐకమత్యంతో మెలగాలి



గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్న రామశర్మ

పాల్వంచ: బ్రాహ్మణులు ఐకమత్యంతో ఉండాలని, ఏ సమస్య ఉన్నా ఒకరినొకరు సహకరించుకోవాలని గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు గర్నేపూడి రామశర్మ అన్నారు. సోమవారం స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక నియోజకవర్గ అధ్యక్షుడు పురాణం రామప్పశాస్త్రి నివాసంలో సమావేశాన్ని నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంఠం వెంకటరమణ, నకిలం వెంకటరమణ, దుర్గా రాజు, చెరుకుపల్లి సూర్యకిరణ్, సుమన్‌శర్మ, కిరణ్, ప్రవీణ్ శర్మ, సత్యనారాయణశర్మ, దత్తాత్రేయశర్మ, పవన్ కుమార్‌శర్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత



నియామకపత్రాలు అందుకున్నవారితో ఏరియా జీఎం రమేశ్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు చెందిన వివిధ విభాగాల్లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగ నియామక పత్రాలను సోమవారం ఏరియా జీఎం జక్కం రమేశ్ అందించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 16 మందికి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, శ్రీరమేశ్, దేవరకొండ కిరణ్‌బాబు, మురళి, సుధాకర్, అనూష, సాగర్, శ్రీనివాసరెడ్డి, నామాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఖాజాబాబా

కొత్తగూడెంఅర్బన్: ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ధర్నాలో భాగంగా సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ భద్రాచలంరోడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో క్రూబుకింగ్ లాబీ ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రెటరీ ఖాజాబాబా మాట్లాడుతూ రోజురోజుకూ లోకో పైలెట్లపై పనిభారం అధికం చేస్తూ వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని వివరించారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల ఉద్యోగులపై అధికభారం పడుతోందని తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు, ఓంకుమార్, సంపత్, పుల్లయ్య, పవన్‌కుమార్, భిక్షపతి, సుధాకర్, జీవరత్నం, సురేశ్‌రాజా, ఎంఎస్‌బీ రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సైదుబాబు

సుజాతనగర్: బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సింగభూపాలెం గ్రామానికి చెందిన మెట్టెల సైదుబాబు నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని విడుదల చేశారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి సైదుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై కళాబృందం ప్రదర్శన

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సోమవారం జూలూరుపాడులో అవగాహన కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమం, ఆరోగ్యలక్ష్మి, పరిసరాల పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనం, హరితహారం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రజలకు పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్వి, గుండెపిన్ని విజయ, సునీత, పాగి వెంకన్న, వెంకటేశ్వర్లు, జాన్, గురువయ్య, ముత్యం, హుస్సేన్, బాలు, స్నేహ, నరేందర్, రాధిక, రాణి, సుశీల, విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

జూలూరుపాడు: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేస్తూ జీఓ విడదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి స్థానిక సెర్ప్ కార్యాలయంలో సోమవారం ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, డీఎంజీ వీరభద్రం, సీసీలు ధరావత్ నాగేశ్వరరావు, బండ్ల మధుసూదన్‌రావు, శెట్టి రామారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి శ్రీవెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని సోమవారం సాయంత్రం పట్టణ వీధుల్లో ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ముగింపులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేశ్‌శర్మ, ఫణిరాజాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్త సమాజ మండలి సమన్వయకర్త ఊకే భద్రయ్య, సలహామండలి సభ్యులు బండి వెంకటేశ్వర్లు, శాఖమూరి వెంకటేశ్వరరావు జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురం రాము, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, పిట్టా లక్ష్మిరెడ్డి, బండి నారాయణ, వేమూరి వెంకటేశ్వరరావు, కంతాల వెంకటేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, జిన్నె రమేశ్, రాంజీ, ఏటుకూరి నరేశ్, గడ్డం వెంకట సుబ్బయ్య, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా జీవన విధానం కావాలి



యోగా శిక్షణ ఇస్తున్న ట్రైనర్

కొత్తగూడెంఅర్బన్: యోగా మనిషి ఆరోగ్యానికి అత్యంత ఆవశ్యకమని, ప్రశాంత జీవనం, పలు శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతో అవసరమని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ తెలిపారు. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నాగరాజశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ అనంతరం పాఠశాలల్లోని పిల్లలందరికీ యోగా తప్పనిసరిగా నేర్పాలని సూచించారు. అనంతరం యోగా శిక్షకులు యామిని, లక్ష్మణ్ వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి స్టెల్లా మేరీ, యోగా గురువు సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీటీం ఇన్‌చార్జ్ రమాదేవి

కొత్తగూడెంటౌన్: బాలికలు ప్రస్తుత సమాజంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా షీటీం ఇన్‌చార్జ్ పి.రమాదేవి సూచించారు. రామవరం ఎంజేపీటీబీసీడబ్ల్యూ పాఠశాలలో సోమవారం షీటీమ్స్, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. బయటకు వెళ్లినప్పుడు ఇతరులతో జాగ్రత్తగా మెలగాలని సూచించారు. మంచిగా మాట్లాడుతూనే మోసం చేస్తారని, ఎంతో అప్రమత్తతగా వ్యవహరించాలన్నారు. అపరిచితులతో సమస్యలు, ర్యాగింగ్, సైబర్ నేరాల బారిన పడితే షీటీమ్స్ నంబర్ 87126 82131కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అటెన్షన్ ప్లీజ్

ఆరు నెలలుగా తాగునీరు లేదు..



టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా ప్రాథమిక పాఠశాలలో ఆరు నెలల నుంచి బోరు బావి నుంచి నీరు రావడం లేదు. దీంతో మధ్యాహ్న భోజన అవసరాలు, టాయ్‌లెట్ల వినియోగం, తాగేందుకు నీరు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు సమస్య వివరించినా పట్టించుకోలేదని తెలుస్తోంది. అడపాదడపా ట్యాంకర్ నీళ్లు పంపిస్తే అవి వంటలకు, తాగేందుకు ఎంతవరకు సురక్షితమో తెలియని దుస్థితి. విద్యార్థులు ఇంటి నుంచే బాటిళ్లలో తాగునీరు తెచ్చుకుంటున్నారు.

- టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి, బేతంపూడి
సెల్ నంబర్ : 99085 04480